


"చూస్తుండగానే రోజులు క్షణాల్లా గడిచిపోయాయి. సరిగ్గా 3 రోజుల్లో నా ప్రయాణం. గంటలు గడిచిపోతున్నా, నా మనసు కుదురుగా లేదు. ఈ క్రమంలో నేను వెళ్ళేరోజు రానే వచ్చింది. నాన్న ఏం ఆలోచించాడో తెలియదు, నవ్వుతూ నా ముందుకొచ్చాడు. పొద్దుపోయే సమయం, వాకిట్లో కూర్చున్నామిద్దరం. పిల్లమేకలు అరుస్తూ, చెంగుచెంగున గెంతుతూ మా మధ్యలో నుండి అటు ఇటు పరుగెడుతున్నాయి. కోళ్ళు గూళ్ళలోకి వెలుతుంటే కోడిపిల్లలు చిన్న గొంతుతో అరుస్తూ వాటి వెనకాలే నడుస్తున్నాయి. నాన్న మాట్లాడటం ప్రారంభించాడు. "పార్టీ మన లాంటి ఎంతో మంది పేదవాళ్ళకోసం పని చేస్తున్నది. అలాంటి పార్టీలో నీవు చాలా ధైర్యంగా, చురుగ్గా పని చేయాలి. మిలటరీ పరంగా బాగా ఎదగాలి. ఏ సయమంలోనైనా శతృవును ఎదుర్కోవడానికి సిద్ధంగా వుండాలి. ముఖ్య విషయమేమంటే ఎప్పుడు కూడా ఊగిసలాటకు గురి కావద్దు. సమస్యలు వచ్చినప్పుడు మరింత ధైర్యంగా వాటిని తట్టుకొని ముందుకెళ్ళాలి. ఇంటికెళ్ళాలనే ఆలోచన ఎట్టి పరిస్థితుల్లో రానియకూడదు. నీ ప్రాణం వున్నంత వరకు నిన్ను నమ్మిన ప్రజల కోసం పని చేయి. ఇక నేను ఒంటరినవుతానని బాధపడకు. ఎప్పుడూ ప్రజల్లో వుండే నేను ఒంటరి కాను" అంటూ తల నిమిరాడు నాన్న. నాన్న మాట్లాడిన మాటాలకు నాకు కళ్ళు చెమర్చాయి. లేచి నిటారుగా నించున్నాను. తలెత్తి నాన్నను చూస్తే ఎంతో ఉన్నతంగా కన్పించాడు. చేతులు కలిపాను. చేతి సంచి భుజాన తగిలించుకుని నాలుగడుగులు ముందుకు వేసి వెనుదిరిగాను. మా ఇల్లు, నాన్న, కోళ్ళు, మేకలు, గొడ్లు అన్నీ నా కన్నీటిలో మసక మసకగా కన్పిస్తున్నాయి. కానీ మాలాంటి వేలాది గ్రామాల్లో విప్లవ రాజకీయాలను ప్రతిష్టించాలనే నా ఆశయం స్పష్టంగా దారి చూపిస్తుండగా వడివడిగా ముందుకు నడిచాను."

